
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సిద్దిపేట

5

ఆదివారం 4 మే 2025



నవ్వు నలభై విధాల మంచిది

- శారీరక, మానసిక రుగ్మతలు దూరం
- సంపూర్ణ ఆరోగ్యానికి దివ్యౌషధం
- నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

7

ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ అధికారులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్ష





సంగారెడ్డిలోని ఐబీలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సమావేశంలో పాల్గొన్న ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్ అధికారులు

సంగారెడ్డి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ఐబీలో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ అధికారుల టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి టౌన్‌లో ఉమెన్స్ డిగ్రీ కళాశాల నిర్మాణ పనుల పురోగతిని జగ్గారెడ్డి అడిగి తెలుసుకున్నారు. మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌లో అదనపు వసతిగదులతో పాటు 300 మంది విద్యార్థినులకు సరిపోయేలా కిచెన్, డైనింగ్ రూమ్‌లు, మూడంతస్తుల్లో ఏర్పాటు అయ్యేలా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థుల అవసరాలమేరకు మినీ ఆడిటోరియం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మహిళా జూనియర్ కళాశాల కోసం ప్రత్యేక హాస్టల్ భవనానికి ప్రతిపాదనలు రెడీ చేయాలని సూచించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాత్‌రూమ్‌లు, అవసరమైన ఇతర మరమ్మతుల కోసం కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలి జగ్గారెడ్డి ఆదేశించారు. సంగారెడ్డి పట్టణంలోని బాలికల ప్రైమరీస్కూల్, గర్ల్స్ జూనియర్, గర్ల్స్ డిగ్రీ కాలేజీల్లో కావాల్సిన అన్ని మరమ్మతు పనులకు అంచనాలు రూపొందించాలని సూచించారు. సదాశివపేట పట్టణంలో కేజీబీవీ పాఠశాలలో ఓల్డ్‌బ్లాక్‌లో అవసరమైన ప్రధానమైన మరమ్మతులకు సైతం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోపాజీ అనంతకిషన్, కూన సంతోష్, షఫీ, కిరణ్‌గౌడ్, మహేశ్, ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డీఈ రాజు, ఏఈలు రాజమల్లయ్య, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

మల్లన్నసాగర్-తపాస్‌పల్లి కెనాల్ పనులు పూర్తిచేయించాలి

- మంత్రులు ఉత్తమ్, పొంగులేటిని కోరిన ఎమ్మెల్యే 'పల్లా'



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు కాళేశ్వరం జలాలు అందించేందుకు మల్లన్నసాగర్ నుంచి చేపట్టిన గ్రావిటీ కాలువ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, త్వరితగతిన పూర్తి చేయించాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. దేవాదుల మూడో దశ పనుల పరిశీలనలో భాగంగా శనివారం దేవన్నపేట పంప్‌హౌజ్‌లో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. జనగామ నియోజకవర్గంలో దేవాదుల కెనాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, పలువురు రైతులకు పరిహారం అందించలేదని, తద్వారా పనులు నిలిచిపోయినందు నిధులు కేటాయించి పూర్తిచేయాలని పల్లా కోరారు. దేవాదుల ద్వారా తపాస్‌పల్లికి పంపింగ్ చేయడం భారంగా మారుతుందని వివరించారు. మల్లన్నసాగర్ నుంచి గ్రావిటీ ద్వారా చేపట్టిన పనులు 25శాతం పూర్తయ్యాయని, వేగవంతంతో పూర్తిచేపడితే భారం తీరుతుందన్నారు. ఈవిషయాలపై పలుమార్లు విజ్ఞప్తులు చేశానని, వెంటనే పనులు పునఃప్రారంభించి జనగామకు సాగునీటి కష్టాలు తొలగించాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు.

బాలికలకు నైపుణ్య శిక్షణ

కేజీబీవీ విద్యార్థినుల కోసం సమ్మర్ క్యాంప్

మిట్టపల్లి కస్తూర్బాలో రేపటి నుంచి ప్రారంభం

ఎనిమిది అంశాలపై ఉచిత శిక్షణ




సిద్దిపేట సమీపంలోని మిట్టపల్లి కస్తూర్బా విద్యాలయం

సిద్దిపేట కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : సమ్మర్ స్పెషల్ క్యాంపులంటే ప్రైవేట్ స్కూళ్లలో, పలు ఇన్‌స్టిట్యూషన్‌లలో మాత్రమే కనిపించేవి. అవీ పట్టణాల్లో మాత్రమే చూస్తుండే వాళ్లం. ఫీజులు చెల్లించే స్తోమత ఉన్న తల్లిదండ్రులు మాత్రమే పిల్లలను ఈ క్యాంపులకు పంపించే వాళ్లు. కానీ, ప్రస్తుతం ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా విద్యా శాఖ పర్యవేక్షణలో ప్రతీ మండలంలో స్వచ్ఛందంగా సమ్మర్ క్యాంపులను ప్రారంభించగా, విజయవంతంగా కొనసాగుతున్నాయి. అలాగే, గ్రామీణ విద్యార్థినులను నైపుణ్యవంతులను చేసేందుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లోనూ ఉచిత వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

పదిహేను రోజులు శిబిరం

ఈనెల 5వ తేదీ నుంచి 20 వరకు పదిహేను రోజుల పాటు జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా సంయుక్త ఆధ్వర్యంలో సిద్దిపేట సమీపంలోని మిట్టపల్లి కేజీబీవీలో సమ్మర్ క్యాంపును నిర్వహించనున్నారు. జిల్లాలోని 23 కేజీబీవీలలోని ఆసక్తి కల్గిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇప్పటికే 150 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. క్యాంపులో భోజన వసతి ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది. ఉచిత సమ్మర్ క్యాంపులో విద్యార్థినులకు ఎనిమిది అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో మ్యూజిక్, డ్యాన్స్, పెయింటింగ్, కంప్యూటర్ స్కిల్స్, స్పీడ్ మ్యాథ్స్, క్రీడలు, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్ అంశాలలో శిక్షణ ఇవ్వబడుతుంది. అంతేకాకుండా ట్రైనింగ్‌కు అవసమైన మెటీరియల్‌ను ఉచితంగా అందజేయనున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమయాన్ని బట్టి శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. కోర్సు కో ఆర్డినేటర్లుగా విద్యాశాఖ ప్రత్యేక అధికారులను నియమించింది. అంతేకాకుండా బాలికల భద్రత కోసం వ్యాయామ ఉపాధ్యాయురాలు, ఏఎన్ఎమ్, స్కూల్ సిబ్బంది రాత్రి కూడా విధుల్లో ఉండనున్నారు.



నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం



విద్యార్థినులకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడాతాయి. మానసిక ఉల్లాసంతో పాటుగా నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం ఉంటుంది. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలతో విద్యార్థుల్లో మంచి అలవాట్లు అలవడతాయి. అంతేకాకుండా కేజీబీవీల్లో అడ్మిషన్లు కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

-రంగనాథ్, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్

జిల్లా పరిపాలన వ్యవస్థకు గుండెకాయ వంటి కలెక్టరేట్‌లో కొందరు అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం 10 గంటలకే తెరుచుకోవాల్సిన కార్యాలయాల తలుపులు 11 గంటలు దాటినా మూసివేసే కనిపించాయి. 10.30 గంటల వరకే బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర వేయాల్సిన వారు గంట ఆలస్యంగా.. తీరుపారుగా అడుగుపెడుతున్నారు. ఇక ఆఫీసుల్లో దర్జాగా కూర్చొని ఫోన్లు, వాట్సాప్‌లు, చాటింగ్‌లు, సోషల్ మీడియాలో బిజీగా ఉన్న సన్నివేశాలు దర్శనమిచ్చాయి. ఓ కార్యాలయంలో ఏకంగా సిబ్బంది కుర్చీల్లోనే గురకపెట్టి నిద్రపోవడం గమనార్హం. సమయం 12 గంటలు కావొస్తున్నా కార్యాలయాల్లో ఖాళీ కుర్చీలే వెక్కిరించాయి. ఇలాంటి ఎన్నో చిత్రవిచిత్రాలు కలెక్టరేట్‌లో కళ్లముందు నిలిచాయి. కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగుల సమయపాలనపై శనివారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన విజిట్‌లో అనేక వాస్తవాలు వెలుగుచూశాయి.



11 గంటలైనా కానరాని వైద్యశాఖ ఉద్యోగులు

ఆంధ్రజ్యోతి విజిట్

అడిగేదెవరు?

అంతా మా ఇష్టమంటున్న కలెక్టరేట్ ఉద్యోగులు

- సమయపాలన పాటించని అధికారులు, సిబ్బంది
- ఉదయం 11 గంటలు దాటినా బయోమెట్రిక్ బిజీనే..
- కార్యాలయాల్లో ఫోన్లు, సోషల్‌మీడియాతో కాలక్షేపం
- పట్టపగలే ఆఫీసుల్లో గురకపెట్టి నిద్రిస్తున్న వైనం
- ఫీల్డ్ విజిట్ పేరిట చాంబర్లకు రాని అధికారులు
- సోమవారం 'ప్రజావాణి' ఉండడంతో అందుబాటులో
- మిగతా రోజుల్లో ప్రజలకు తప్పని ఎదురుచూపులు



కలెక్టరేట్‌లో అధికారుల కోసం వేచి చూస్తున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట/సిద్దిపేట/సిద్దిపేట క్రైమ్/సిద్దిపేట కలెక్టరేట్/సిద్దిపేట అర్బన్/సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట రూరల్/నంగునూరు/తొగుట, మే 3 :సమస్యల పరిష్కారానికి సిద్దిపేట జిల్లా ప్రజలు చివరి గడప తొక్కాల్సింది కలెక్టరేట్ కార్యాలయానిదే. పల్లెలు, పట్టణాలు, మండలాలు, డివిజన్ కేంద్రాల్లో పరిష్కారం కాని పనులకు గమ్యాన్ని వెతుక్కుంటూ కలెక్టరేట్ దాకా వస్తారు. జిల్లా కలెక్టర్‌తోపాటు ఇద్దరు అదనపు కలెక్టర్లు, అన్ని శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు ఒకేచోట దర్శనమిస్తారనే నమ్మకమే వారిని ఇక్కడిదాకా రప్పిస్తుంది. అయితే కలెక్టర్, అదనపు కలెక్టర్ల బిజీ షెడ్యూల్ కారణంగా వారు ఫీల్డ్ విజిట్లకు వెళ్తారు. ఒక్కోసారి సమీక్షలు, ఇతర కార్యకలాపాల కారణంగా కలెక్టరేట్‌లోనే ఉంటారు. కానీ కొందరు జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సైతం సమయానికి తమ కార్యాలయాల గడపలు తొక్కడం లేదు. ఇలాంటి వారి కోసం ఎక్కడి నుంచో వచ్చిన ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇలా అందిన ఫిర్యాదులతోనే శనివారం కలెక్టరేట్ సిబ్బంది సమయపాలన, హాజరు, గైర్హాజరుపై 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించింది.

సోమవారమే సరైన సమయమా..

సెలవు రోజుల్లో మినహా ప్రతీరోజు కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండాలి. ఇందులో కొన్ని శాఖల అధికారులకు క్షేత్ర స్థాయి పరిశీలనలు ఉంటాయి. కానీ సిబ్బంది, ఉద్యోగులు మాత్రం కార్యాలయాల్లోనే ఉండాలి. అయితే సోమవారం మాత్రమే అధికారులు, సిబ్బంది పూర్తిగా అందుబాటులో ఉంటున్నారనే అభిప్రాయాలు నెలకొన్నాయి. ఆరోజు ప్రజావాణి ఉన్నందున

మిగతా 8వ పేజీలో



ఉదయం 10.40 గంటలకు వ్యవసాయ శాఖ అధికారి లేకున్నా చాంబర్‌లో వెలుగుతున్న లైట్లు



ఉదయం 11.19 గంటలకు బయో మెట్రిక్ నమోదు చేస్తున్న కార్యాలయ సిబ్బంది



ఫోన్ చూస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది

విహారం.. విషాదం

- ప్రమాదాలకు నిలయంగా రిజర్వాయర్లు.. పలువురు మృత్యువాత
- జనవరిలో కొండపోచమ్మసాగర్‌లో మునిగి ఐదుగురి మృతి
- తాజాగా రంగనాయక సాగర్‌లో ఇద్దరు..
- ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు

7



రంగనాయకసాగర్ వద్ద బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు

జూబ్లీహిల్స్ పెద్దమ్మ, బల్కంపేట ఎల్లమ్మ ఆలయాల్లా అభివృద్ధి చేస్తాం

- రూ. 9 కోట్లతో ప్రతిపాదనలు చేశాం
- హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తాం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ గుడిని జూబ్లీహిల్స్ పెద్దమ్మ, బల్కంపేట ఎల్లమ్మ ఆలయాల్లా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. రూ.9 కోట్లతో దేవాలయ అభివృద్ధికి ప్రతిపాదనలును పంపించామని వెల్లడించారు. శనివారం రాత్రి ఆయన ఎల్లమ్మ ఆలయంలో జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ నుంచి నెల రోజుల పాటు జరిగే రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఆలయ కమిటీని నియమిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. హుస్నాబాద్ ఎల్లమ్మకు అందరు బోనాలు చేస్తారని, ఇది ఒక కులానికి పరిమితమైన ఆలయం కాదన్నారు. ఆలయ ప్రాంగణంలోని పురాతన పోచమ్మ గుడిని కూడా స్థపతి ప్రకారంగా నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్ గౌరవం పెరిగే విధంగా ఈ ఉత్సవాలు జరుపుకుందామని, రాష్ట్రంలో ముఖ్యమైన వారంతా ఇక్కడికి వచ్చేలా చేస్తానన్నారు. ఆలయ ప్రాంగణంలో బాంకెట్ హాల్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఈవో కిషన్ రావు, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.



శనిగరం ఐకేపీ కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన కలెక్టర్ మనుచౌదరి

'శనిగరం' కాలువల్లో పూడిక తీస్తాం

కోహెడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : శనిగరం ప్రాజెక్టు కాలువల్లో పూడిక తీయిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హామీ ఇచ్చారు. దీంతో వరి ధాన్యం ఉత్పత్తి మరింత పెరుగుతుందన్నారు. శనివారం ఆయన శనిగరం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధునాతన ప్యాడీ క్లీనర్ అండ్ డ్రయ్యర్ యంత్రాన్ని కలెక్టర్ మనుచౌదరితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా శనిగరం నుంచి జిల్లా కేంద్రాలకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని గ్రామస్థులు మంత్రికి విన్నవించారు. స్పందించిన ఆయన త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వంటిమామిడి దగ్గర వెజిటబుల్ మార్కెట్ మాదిరి శనిగరం వద్ద చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు రైస్‌మిల్ ఇవ్వాలని ప్రభుత్వ పరిశీలనలో ఉందని, అలాంటిది ప్రారంభమైతే మొదట ఇక్కడే రైస్‌మిల్‌ను ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్‌లో అవినీతి ఆరోపణలపై విచారణకు ఆదేశం

'రెవెన్యూ లీలలు' కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 3 : సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ పరిధిలో పెద్దపెద్ద భవనాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లకు సంబంధించి డబ్బు తీసుకొని ఆస్తి పన్నును తక్కువ చేశారని ఈనెల 2న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'రెవెన్యూ లీలలు' కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు విచారణ చేపట్టి నివేదిక అందించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించినట్లు శనివారం కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కాగా 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది. పట్టణవాసులు, పుర ప్రముఖులు, నాయకులు చర్చించుకుంటున్నారు. మున్సిపల్‌కు ఆదాయాన్ని తీసుకరావాల్సింది పోయి, మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్న ఉద్యోగుల తీరుపై మండిపడుతున్నారు.

'నీట్'కు సర్వం సిద్ధం

- నేడు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో హాజరుకానున్న 4,690 మంది అభ్యర్థులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు

7



తిరుమలాపూర్ వంతెనపై నుంచి పడి వ్యక్తి మృతి

పెద్దశంకరంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలాపూర్ వంతెనపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని 161వ జాతీయ రహదారిపై జరిగింది. పెద్దశంకరంపేట ట్రైనీ ఎస్సై అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన బోయిని అనుప్(31) బైక్‌పై పెద్దశంకరంపేట నుంచి అల్లాదుర్గం వెళ్తుండగా ముందున్న బైక్‌ను వెనుకనుంచి వచ్చి ఢీ కొట్టాడు. దీంతో భయాందోళనకు గురై బైక్ వదిలి పారిపోతున్న సమయంలో వంతెనపై నుంచి కింద పడిపోగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. అనుప్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్సై అరవింద్ తెలిపారు.


మృతి చెందిన అనూప్

కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతి

మాసాయిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున మాసాయిపేట మండలం కేంద్రంలోని షేర్ పంజాబీ దాబా వద్ద జరిగింది. చేగుంట ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌లోని అజ్మీర్ కోడాకు చెందిన జిగ్రీ ప్రహ్లాద్ 42 అనే లారీ డ్రైవర్ షేర్ పంజాబీ దాబా వద్ద రోడ్డు దాటుతూ ఉండగా కారు ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. శవాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి వెల్లడించారు.

వేచరేణి ఘటనలో ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

చేర్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేచరేణి గ్రామ శివారు ఎల్లదాసునగర్ కాలనీలో ఇటీవల చోటుచేసుకున్న దాడి ఘటనలో ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఎల్లదాసునగర్ కాలనీకి చెందిన వ్యక్తి ఇటీవల మద్యం మత్తులో గ్రామంలోని ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేయగా, స్థానికులు, హిందూ సంఘాల ప్రతినిధులు అతడికి దేహశుద్ధి చేసి, తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పగించారు. అయితే, ఈ విషయంలో వ్యక్తిపై దాడికి పాల్పడిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దళిత సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. దాడికి పాల్పడిన ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని, మరికొంతమందిని త్వరలో పట్టుకుంటామని ఏసీపీ తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం ఘటనపై ఆరా తీశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

మృతుడు యాదాద్రి జిల్లా వ్యక్తి


మృతుడి (ఫైల్‌ఫోటో)

ములుగు, మే 3 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం బస్వాపూర్‌లో మృతి చెందిన వ్యక్తి కేసును 24 గంటల్లోనే పోలీసులు చేధించారు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై విజయ్‌కుమార్ నాలుగు బృందాలుగా ఏర్పడి మృతుడి ఆచూకీ తెలుసుకున్నారు. సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన దాచారం సాయికుమార్(25)గా గుర్తించారన్నారు. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సాయికుమార్‌ను చంపి బస్వాపూర్ అడవి ప్రాంతంలో నిప్పంటించారు. శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి

●నిందితుడిని పట్టుకుని అరిచిన మహిళ


జోగిపేట రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి చేసి బంగారు పుస్తెల తాడును దోచుకెళ్ళే ప్రయత్నం చేసిన దుండగుడికి స్థానికులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన సంగుపేట ఎక్స్ రోడ్ వద్ద జరిగింది. దీనికి సంబంధించి, జోగిపేట ఎస్సై పాండు కథనం ప్రకారం.. జోగిపేట పట్టణానికి చెందిన మాల నిర్మల అనే మహిళ, తన కూతురి రాక కోసం సంగుపేట చౌరస్తా వద్ద శనివారం ఉదయం నిరీక్షిసుంది. బైక్ పై అటుగా వెళ్తున్న పుల్కల్ మండలం మిన్పూర్‌కు చెందిన లస్కర్ సుభాష్ అనే యువకుడు, సదరు నిర్మల గొంతునులిమి, ఆమె ఒంటిపైనున్న బంగారు పుస్తెల తాడును దోచుకునే ప్రయత్నం చేశాడు. అయితే నిర్మల ప్రతిఘటించి నిందితుడు సుభాష్ చేతిని గట్టిగా పట్టుకుని అరవడంతో, స్థానికులు సుభాష్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిర్మల ఫిర్యాదు మేరకు సుభాష్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో స్నానానికి వెళ్లి యువకుడి మృతి


గుమ్మడిదల, మే 3 (ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్ రెడ్డి కథన ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్నూర్ గ్రామానికి చెందిన మిర్యాల ప్రసాద్ (20) అనే యువకుడు తన అన్న శివతో కలిసి రెండు సంవత్సరాల నుంచి బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతంలో చెత్త ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే, ఈనెల 1వ తేదీన ఉదయం ప్రసాద్ శివతో తాను మంగళషాప్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఆరోజు మధ్యాహ్నం అయినా తిరిగి రాకపోవడంతో ఎక్కడో చెత్త ఏరుకుంటూ ఉండచ్చని భావించారు. మూడో తేదీ బొంతపల్లి సమీపంలోని అలక చెరువులో ఓ యువకుడు నీట మునిగి చనిపోయి ఒడ్డున చేరాడని సమాచారం తెలియడంతో అన్న శివ అక్కడికి వెళ్లి చూడగా తన తమ్ముడే అని గుర్తించాడు. చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదం శాత్తు మృతి చెందాడని ఎలాంటి అనుమానం లేదని ప్రసాద్ అన్న స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై మహేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోడ యాదయ్య (48) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై ఇంట్లో గొడవ పడేవాడు. జీవితంపై విరక్తి చెందిన యాదయ్య శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఆసుపత్రికి తరలించారు.













నిరుపయోగంగా నీటి తొట్లు

● అల్లాడుతున్న మూగజీవాలు



కోహీర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఎండలకు చెరువులు, కుంటలు ఎండిపోవడంతో పశువులు నీటికోసం అలమటిస్తున్నాయి. వాటి దాహార్తి తీర్చేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో సింగిల్‌ఫేజ్ మోటర్లు, గ్రామానికి నీటి సరఫరా చేసే బోరు బావులు, ట్యాంకుల వద్ద పశువులకు తాగు నీటి తొట్లు నిర్మించారు. వాటి నిర్వహణ గాలికొదిలేయడంతో మండలంలోని పలు గ్రామాల్లో అవి నిరుపయోగంగా మారాయి. మరికొన్ని గ్రామాల్లో శిథిలావస్థకు చేరాయి. మండలంలోని బడంపేట పర్శ పల్లి పైడిగుమ్మల్, బిలాల్‌పూర్ తదితర గ్రామాల్లో నీటి తొట్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నీటి తొట్లను వినియోగంలోకి తేవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మరోవైపు కొన్ని గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నీటి తొట్లను నిర్మించాల్సి ఉండగా సరిపడా నిధులు మంజూరుకాక కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. దీంతో మూగ జీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి.



శ్రామికులు.. సంపద సృష్టించే కష్టజీవులు

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



మహాసభలో మాట్లాడుతున్న చుక్క రాములు

రామాయంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): శ్రామికులు కట్టు బానిసలు కాదు.. దేశానికి సంపద సృష్టించే కష్టజీవులని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. మెదక్ జిల్లా రామాయంపేటలో శనివారం సీఐటీయూ 15వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సభకు హాజరైన ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాల్సింది పోయి.. 29 రకాల కార్మిక చట్టాలను రద్దుచేసి ఉరితాళ్లు బిగించేలా చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే వేరే దారి లేక ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక లోకం సన్నద్ధమవుతోందన్నారు. ప్రధానమంత్రి మోదీ పెట్టుబడిదారుల పక్షం నిలుస్తూ.. అసంఘటిత కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా శ్రామికుల సమస్యలు ఎండగట్టే లక్ష్యంగా అన్ని జిల్లాల్లోనూ వంతుల వారిగా మహా సభలు నిర్వహించి కార్మికుల పక్షాన తీర్మానాలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఐక్య పోరాటాల వల్లే సమస్యలు పరిష్కారం సాధ్యమని, అందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు బాలమణి, మల్లేశం, కె.నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు. మహాసభల్లో భాగంగా ఆదివారం రామాయంపేటలో కార్మికుల బల ప్రదర్శన సాగనుంది. వేలాది మందితో పట్టణ పురవీధుల గుండా రాష్ట్ర ప్రతినిధుల ఆధ్వర్యంలో కార్మిక ర్యాలీ నిర్వహించనున్నారు.

ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలందిస్తాం

● సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

● కంది సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ


ఖైదీలకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

కంది, మే 3 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో చేసిన నేరాలకు శిక్షను అనుభవిస్తున్న ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలు అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో ఆమె శనివారం కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీల బ్యారక్‌లు, గదులు, వంటగది, బాత్రూంలు, జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించారు. ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చూశారు. ఖైదీల కోసం వండే కూరగాయలు, బియ్యం, ఉన్న స్టోర్‌రూమ్‌ని కూడా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.. జైలులో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్ పరిశీలించారు. ఖైదీలకు కావాల్సిన అవసరాలు, సదుపాయాలు అన్ని అందించేలా చూడాలని జైలు సూపరింటెండెంట్ సంతోష్‌రాయ్‌కు సూచించారు. అనంతరం ఆమె ఖైదీలతో సమావేశమై సమయానికి బెయిల్స్, ములాఖత్‌లు అందుతున్నాయా అని ఖైదీలను ఆరా తీశారు. ఆమె వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, జైలర్లు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఆధార్, పాన్‌కార్డుల తయారీ

● దుబ్బాకలోని బాలాజీ జిరాక్స్ సెంటర్‌పై పోలీసుల దాడి

దుబ్బాక, మే3(ఆంధ్రజ్యోతి): జిరాక్స్ సెంటర్ ముసుగులో నిర్వాహకుడు నకిలీ ఆధార్, పాన్ కార్డులు, ఆర్సీబుక్కులను తయారు చేస్తూ పోలీసులకు చిక్కాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాకలోని బాలాజీ ఆన్‌లైన్ కంప్యూటర్, జిరాక్స్ సెంటర్ నిర్వాహుడు సిరిమల్లే వేణుగోపాల్ టెక్నాలజీని ఉపయోగించి కంప్యూటర్, కలర్ ప్రింటర్‌ద్వారా నకిలీ గుర్తింపు కార్డులను తయారు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం ఆ సెంటర్‌లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి నకిలీ పాన్‌కార్డులు, ఆర్సీలు, ఆధార్‌కార్డులను గుర్తించారు. ఈ మేరకు కంప్యూటర్, సీపీయూ, జిరాక్స్ మిషన్, కలర్ ప్రింటర్‌తోపాటు పలు చిప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

'నీట్'కు సర్వం సిద్ధం

● నేడు మ.2 నుంచి 5 గంటల వరకు నిర్వహణ

● ఉమ్మడి జిల్లాలో హాజరుకానున్న 4690 మంది అభ్యర్థులు

● అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

● పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు

సంగారెడ్డి క్రైం/సంగారెడ్డి రూరల్/సిద్దిపేట కల్చరల్/మెదక్ అర్బన్ , మే 3 (ఆంధ్రజ్యోతి) : నేడు నిర్వహించే నీట్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4690 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. సంగారెడ్డి జిల్లాలో 3320 మందికి ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 883 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఇక మెదక్‌లో తొలిసారిగా జరగనున్న నీట్ పరీక్షకు 487 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ఐఐటి కందిలో రెండు, తార ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో ఒకటి, జేఎన్టీయూ సుల్తాన్పూర్‌లో రెండు, కేంద్రీయ విద్యాలయం ఎద్దు మైలారంలో ఒకటి, సంగారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించినట్లు పేర్కొన్నారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. గదులను తనిఖీ చేసి సీసీ కెమెరాలు, జామర్ల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.


పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ (ఫైల్)

1.30 కే గేట్లు క్లోజ్..

విద్యార్థులు అడ్మిట్ కార్డు, ఏదైనా గుర్తింపు కార్డు(ఆధార్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ కాడ్డు, డ్రైవింగ్ లైసెన్స్)తో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తప్పని సరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విదానంలో పరీక్ష జరుగుతుందని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటలకు గేట్లు క్లోజ్ చేస్తారని, తర్వాత విద్యార్థులకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదన్నారు. పరీక్ష సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూరి చేసినట్లు వెల్లడించారు.పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు పెన్నులు, పెన్సిళ్లు, ఇతర ఎలాంటి వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురావద్దని, పరీక్షా కేంద్రంలోనే పెన్నులు, పెన్సిళ్లు సమకూర్చనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్ష హాల్‌లోనికి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ వంటి ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు గంట ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచించారు.


సిద్దిపేటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

నీట్ పరీక్ష సందర్భంగా ఆంక్షలు

నీట్ పరీక్ష సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పలు ఆంక్షలు విధించినట్లు సంగారెడ్డి, మెదక్ ఎస్పీలు పరితోష్ పంకజ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు సెంటర్ వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, రాస్తారోకోలు, ప్రచారాలకు అనుమతి లేదన్నారు. సెంటర్ పరిసరాల్లో 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి ఎక్కువ మంది గుమిగూడరాదన్నారు. పరీక్ష సమయంలో ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఏర్పాట్లను పరిశీలించిన గరిమా అగ్రవాల్

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ శనివారం పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట అదనపు డీసీపీ సుభాష్ చంద్ర బోస్, నీట్ పరీక్ష సిటీ కోఆర్డినేటర్ సూర్య ప్రకాష్, పరీక్ష నిర్వహణఅధికారులు తదితరులు ఉన్నారు.


రంగనాయకసాగర్‌లో గల్లంతైన కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

విహారం.. విషాదం

ప్రమాదాలకు నిలయంగా రిజర్వాయర్లు.. పలువురి మృత్యువాత

జనవరిలో కొండపోచమ్మసాగర్‌లో మునిగి ఐదుగురి మృతి

తాజాగా రంగనాయకసాగర్‌లో ఇద్దరు..

ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు

సిద్దిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): సరదాగా కాలక్షేపం కోసం రిజర్వాయర్లకు వస్తున్న సందర్శకులు ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడుతున్నారు. దీంతో విహారయాత్ర కాస్త విషాదయాత్రగా మారుతున్నది. ముఖ్యంగా సిద్దిపేట జిల్లాలో రిజర్వాయర్ల వద్ద ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. జనవరిలో జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మసాగర్ మునిగి హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు మృతి చెందగా.. తాజాగా శనివారం రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో మునిగి ఇద్దరు మృతిచెందారు. వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన రెండు కుటుంబాలు రిజర్వాయర్‌ను వీక్షించేందుకు రాగా బాలుడు, బాలిక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందారు. తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులకు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కనిపించని హెచ్చరిక బోర్డులు..

రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను వీక్షించడానికి సెలవురోజులు, వారాంతంలో సిద్దిపేట జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున సందర్శకులు తరలి వస్తుంటారు. రిజర్వాయర్ బోటింగ్ మెట్ల వద్ద పర్యవేక్షణ లేకపోవడం, సంబంధిత అధికారులు నీటి లోతును తెలిపే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో సందర్శకులు నీటిలో దిగి సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ, ఆడుతూ సందడి చేస్తున్నారు. గతంలో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయినా అధికారులు అప్రమత్తం కాకపోవడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా బోటింగ్ మెట్ల వద్ద సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సిద్దిపేట ఏసీపీ..

రంగనాయకసాగర్ రిజర్వాయర్ సంఘటనా స్థలాన్ని సిద్దిపేట ఏసీపీ మధు పరిశీలించి ఎస్ఐ బాలకృష్ణను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సందర్శనకు వచ్చిన వారు నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

పారదర్శకంగా కమిటీల ఎన్నిక

● ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్

నర్సాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ను సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు పారదర్శకంగా కమిటీల ఎన్నికకు నిర్ణయించినట్లు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుసాయికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ నియోజకవర్గ స్థాయి సంస్థాగత ఎన్నికల సమావేశానికి ఆయనతోపాటు డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెట్టుసాయికుమార్ మాట్లాడుతూ పీసీసీ ప్రత్యేకంగా రూట్‌మ్యాప్ ద్వారా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆయా పార్టీ పదవులను పారదర్శకంగా నియమిస్తున్నదన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికే అందరి ఆమోదం మేరకు ఎంపిక చేస్తామన్నారు. పార్టీలో కీలక నిర్ణయాలు ఆయా కమిటీలే తీసుకుంటాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ పాయింట్లకు నోట్‌బుక్స్


సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకున్న నోట్‌బుక్స్

సంగారెడ్డి అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అందించే నోటు పుస్తకాలు పాఠశాలల పాయింట్లకు చేరుకుంటున్నాయి. ఏటా పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను విద్యార్థులకు సర్కారు ఉచితంగా అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది పై నుంచి వడివడిగా సరఫరా అవుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరానికి (2025-26) సంబంధించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే పాఠ్య పుస్తకాలు కూడా ఇప్పటికే 52 శాతం జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక భారం తప్పించేందుకు ఏటా సర్కారు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న విషయం విధితమే. గతేడాది యూడైస్ ఆధారంగా 1-10 వ తరగతి వరకు అన్ని సబ్జెక్టు పుస్తకాలు, నోటు పుస్తకాలు సరఫరా చేస్తుండగా పాఠశాలల పునఃప్రారంభం నాటికి స్కూల్ పాయింట్లకు చేరవేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పత్తి సాగులో మార్పులపై దృష్టి సారించాలి

● సంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్

ఝరాసంగం, మే3(ఆంధ్రజ్యోతి) : పత్తి సాగులో తాజా మార్పులపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఝరాసంగం రైతువేదికలో అరణ్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పత్తి పంటను సాగు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేషం, అరణ్య సంస్థ సీఈవో పద్మ, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నవ్వు నలభై విధాల మంచిది

నవ్వడం ఒక యోగం.. నవ్వక పోవడం ఒక రోగం అన్నారు పెద్దలు. కానీ, నేటి ఉరుకు పరుగుల జీవితాల్లో మనుషుల ముఖాల్లో చిరునవ్వు మటుమాయమైపోతున్నది. ఒకప్పుడు నవ్వు నాలుగు విధాలా చేటు అనే వారు కానీ.. నవ్వు నలభై విధాలా మంచిది అంటున్నారు మానసిక వైద్య నిపుణులు. నిత్యం నవ్వితే శారీరక, మానసిక రుగ్మతలు దూరమై సంపూర్ణ ఆరోగ్యం దరిచేరుతుందంటున్నారు. ఈ నేపథ్యంలో నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

● శారీరక, మానసిక రుగ్మతలు దూరం

● సంపూర్ణ ఆరోగ్యానికి దివ్యౌషధం నవ్వు

● నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

మెదక్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఏటా మే నెల మొదటి ఆదివారాన్ని ప్రపంచ నవ్వుల దినోత్సవంగా జరుపుకుంటారు. నవ్వులు ఎన్ని రకాలుగా ఉన్నా... చిరునవ్వు మాత్రం చాలా హుందాగా ఉంటుంది. చిరునవ్వులు చిందిస్తూ మాట్లాడేవారిని మంచి కమ్యూనికేటర్‌గా భావిస్తారు. అందుకే భావ వ్యక్తీకరణ నైపుణ్యాల్లో చిరునవ్వు సాధన చేయమంటారు. తిక్కన తన రచనల్లో 32 రకాల నవ్వులను వివరించారు. అందులో పక, పక నవ్వు, కిలకిల నవ్వు, వాళదస్మిత, హర్షానందస్మిత, కల కల నవ్వు, సాదర దరహాసం, వేత్త నవ్వు, కన్నుల నవ్వు, నవ్వు రాని నవ్వు తదితర నవ్వులు ఉన్నాయి.



నవ్వు ఒక దివ్యౌషధం...

నవ్వు ఏదైనా ప్రయోజనాలు మాత్రం అనేకం. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉచితంగా లభించే దివ్యౌషధం ఇది. నవ్వినప్పుడు మెదడులో డోపమైన్, ఆక్సిటోసిన్, సెరోటోనిన్, ఎండార్ఫిన్, రసాయనాలు విడుదలవుతాయి. చిరునవ్వులు చిందించే వారికి ఈ రసాయనాలు విడుదలవ్వడం వలన హాయిగా నిద్ర పడుతుంది. మానసిక ఆందోళన తగ్గుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, అభ్యసనా నైపుణ్యాలు పెరుగుతాయి. నవ్వు వల్ల నార్ ఎడ్రినలిన్ హార్మోన్ సమపాళ్లలో నియంత్రణలోకి వస్తుంది. దీంతో శక్తిని అందిస్తుంది. నవ్వుతో రోగ నిరోధక వ్యవస్థకు అవసరమైన లింపొజైట్స్ ఉత్పత్తి పెరుగుతుంది. ముక్కు, శ్వాస కోశాల్లోని పొరల్లో మెరుగుదల ఉంటుంది. శరీరంలోని సహజ నిరోధక హార్మోన్ల ఉత్పత్తి పెరిగి ఆర్థరైటిస్, స్పాండిలైటీస్, మైగ్రేన్ లాంటి వ్యాధులకు ఉపశమనం లభిస్తుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం, రక్తంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతుంది. దీంతో ఆస్తమా రోగులకు మేలు జరుగుతుంది.

నవ్వుతో ఆందోళన దూరం..



నవ్వు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇటీవల కాలంలో ఎంతోమంది తమ బిజీ జీవితాల్లో నవ్వుకు దూరమవుతూ ఆరోగ్య సమస్యలకు దగ్గరవుతున్నారు. నవ్వడం వలన ఎన్నో సమస్యలనుండి ఉపశమనం పొందవచ్చు. హాస్యం వీడియోలు చూస్తూ ఆందోళనలను దూరం చేసుకోవాలి.

- సురేష్, మానసిక వైద్యనిపుణుడు, మెదక్

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

● లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం, మే 3 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కొల్చారం మండలం వెంకటాపూర్ గ్రామంలో గృహ నిర్మాణ శాఖ, మండల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల విచారణ ప్రత్యేక అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరిగేలా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనలో ఎక్కడా కూడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సజావుగా సర్వే చేయాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా.. అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు అందేలా చూడాలన్నారు. అలాగే సర్వే చేసిన వివరాల పత్రాలను అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. పరిశీలన చేసే క్రమంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఏదేని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల వారీగా పరిశీలన పూర్తి కాగానే అర్హుల జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించాలని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తక్షణమే నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించాల న్నారు. విడతల వారిగా నిధులు మంజూరు చేయనున్నట్లు వివరించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

మోడల్‌స్కూల్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాక,మే3(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపాలిటీలోని లచ్చపేట మోడల్‌స్కూల్‌లో ఇంటర్‌మొదటి సంవత్స రానికి వివిధ కోర్సుల నిమిత్తం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తెలిపారు. శనివారం పాఠశాలలో ఆయన మాట్లాడారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ ఒక్కో గ్రూపుల్లో 40 ఖాళీలు ఉన్నట్టు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 5 నుంచి 20వ తేదీ లోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

● **కొండపాక:** కొండపాక మోడల్ స్కూల్‌లో ఇంటర్ అడ్మిషన్ల కోసం ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు టెన్త్ పాస్ అయిన విద్యార్థులు మోడల్ స్కూల్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26న మెరిట్ జాబితా విడుదలవుతుందని ఎంపికైన విద్యార్థులకు 27, 28 తేదీలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందన్నారు.

కనకరాజుకు డాక్టరేట్



గజ్వేల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన యెర్ర కనకరాజు అస్పెర్జిల్లస్ నైగర్ జేయూసీ-2 జీవాణువు నుంచి హోల్ సెల్యులేజ్‌లను వేరు చేసి ఉత్పత్తి చేయడం, బీటా- గ్లూకోసైడేస్‌ను డీహెచ్ 5 అల్ఫా జీవకణాల్లో క్లోనింగ్ చేయడం అనే అంశంపై పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. ఇందుకుగాను జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ నుంచి యెర్ర కనకరాజు శనివారం డాక్టరేట్ పట్టా పొందారు.

ఆలయాలకు విరాళం

మర్కుక్, మే 3 (ఆంధ్రజ్యోతి): జగన్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ కల్లేపు నవీన్‌రావు అంగడికిష్టాపూర్ దుర్గామాత ఆలయానికి రూ.75 వేల విరాళాన్ని అందజేశారు. తన జన్మదిన సందర్భంగా శనివారం ఆయన విరాళం చెక్కును స్థానిక మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీరాములుగౌడ్‌కు అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఓ కొబ్బరి మొక్కను నాటారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా హరితసేన ఇన్‌చార్జి చెప్యాల రాజేశ్వరరావు, సినీహీరో అనిల్ మొగిలి, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

●మర్కుక్ మండలంలో వరదరాజ స్వామి దేవాలయాన్ని దాతల సహాయంతో పునర్నిర్మాణం చేస్తున్నారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి తన వంతుగా రూ. 1,00,111 విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, స్థానిక నాయకులతో కలిసి ఆలయ అర్చకులకు విరాళాన్ని అందజేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, రామచంద్రంను శాలువాతో సత్కరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దూళిమిట్ట, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలపల్లి గ్రామ మోయతుమ్మెద వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ మధుసూదన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని తహసీల్ కార్యాలయానికి తరలించి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

పశువులపై దుండగుల అత్యాచారం

బెజ్జంకి, మే 3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దుండగులు ఓ ఆవు, గేదెపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని నరసింహులపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసింహులపల్లి గ్రామానికి చెందిన రైతులు జంగపల్లి శ్రావణ్, శ్రీకాంత్ తమ పశువులను రోజు మాదిరిగానే గత నెల 28న సాయంత్రం వ్యవసాయ బావుల వద్ద కట్టేసి ఇంటికి వచ్చారు. మరుసటి రోజు ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లిన రైతులు నిర్ఘాంతపోయారు. పశువుల పై గుర్తు తెలియని దుండగులు అత్యాచారానికి పాల్పడినట్లు గుర్తించారు. శనివారం బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్ఐ శంకర్ రావు తెలిపారు.

కుల గణన చరిత్రాత్మక నిర్ణయం

కోహెడ, మే 3 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మించిన నాయకుడు లేరని జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర క్యాబినెట్‌లో కులగణన, జనగణన చేపట్టేందుకు ఆమోదం చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. బీసీలను అణిచివేయడమే కాంగ్రెస్ చరిత్ర అని విమర్శించారు.

ఫుట్‌బాల్ ఉచిత శిక్షణ శిబిరం

కొండపాక, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెడ ఉన్నత పాఠశాల ఆవరణలో ఫుట్‌బాల్ ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 14 సంవత్సరాల లోపు బాల బాలికలు ఈ శిబిరంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం ఉదయం 6 గంటలకు ఉంటుందన్నారు.

తొగుటలో ఆలయ వార్షికోత్సవం

తొగుట, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తొగుటలో ధ్యానాంజనేయ స్వామి, వీరాంజనేయ స్వామి ఆలయంలో 3వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి చందనాభిషేకం, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు.



చౌటపల్లి నర్సరీలో పెరుగుతున్న మొక్కలు



కట్కూర్ నర్సరీలో మొక్కలకు రక్షణగా గ్రీన్‌షెడ్

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం

అక్కన్నపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా అక్కన్నపేట మండలంలోని ప్రతీ గ్రామానికి ఒక నర్సరీని అధికారులు ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం కింద మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా నీటి సరఫరా చేస్తున్నారు. 1.80 లక్షల వివిధరకాల మొక్కల వరకు పెంచుతున్నారు. ఒక్కో నర్సరీలో 20 రకాల మొక్కలను పెంచుతున్నట్టు ఏపీవో తోడేటి ప్రభాకర్ వివరించారు.

నర్సరీలో పెంచే మొక్కలు ఇలా..

మామిడి, సీతాఫలం, దానిమ్మ, జామ, సపోటా, బత్తాయి, బొప్పాయి, వేప, నిమ్మ, అల్లనేరేడు, గులాబి, తులసి, జమ్మి, గోరింటాకు, పారిజాతం, కానుగ, ఇప్ప, మర్రి, టేకు, అశోక, ఈత, నీలగిరి, తుమ్మ, చామంతి, మల్లె, మద్ది, సంపంగి, మందారం, శ్రీ గంధం, చింత, మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు.



ఈడీఎం విభాగంలో ఉదయం 11.20 గంటలకు నిద్రపోతున్న సిబ్బంది

అడిగేదెవరు?

అంతా మా ఇష్టమంటున్న కలెక్టరేట్ ఉద్యోగులు

ఆంధ్రజ్యోతి విజిట్

(5వ పేజీ తరువాయి)

జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి దరఖాస్తులు సమర్పిస్తారు. కలెక్టర్ లేదంటే అదనపు కలెక్టర్లు వేదికపై ఉంటారు. జిల్లా స్థాయి అధికారులు సైతం హాజరవుతారు. ఇక మిగతా రోజుల్లో ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో.. ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. శనివారం కొందరు ఉద్యోగులు బయోమెట్రిక్ నమోదు చేసి ఆఫీసుల్లోకి వెళ్లకుండా బయట టీ తాగడానికి వెళ్లడం కనిపించింది. ఇక ఖాళీగా కనిపిస్తున్న అధికారుల కుర్చీల గురించి ఆరా తీస్తే ఫీల్డ్ విజిట్‌లో ఉన్నారని సిబ్బంది కప్పిపుచ్చుతున్నారే తప్ప ఎక్కడికి వెళ్లారో చెప్పడం లేదు. అందుకే కలెక్టరేట్‌లో పనులు కావాలంటే సోమవారం ఒక్కరోజే సరైన సమయంగా ప్రజలు భావించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

పర్యవేక్షిస్తేనే ఫలితం

కలెక్టరేట్‌లో ఉద్యోగులు, సిబ్బంది సమయపాలనపై ఆ శాఖల అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే శాఖల అధికారులు సైతం ఆలస్యంగా రావడంతో వారి బాటలోనే ఉద్యోగులు నడుస్తున్నారు. శనివారం ఉదయం 10 గంటల వరకే డీఆర్డీఏ, పశుసంవర్ధక శాఖల జిల్లా అధికారులు తమ చాంబర్లకు వచ్చారు. వారి సిబ్బంది కూడా సమయానికే హాజరయ్యారు. కానీ పలు శాఖల కార్యాలయాల్లో మాత్రం ఆ పరిస్థితి కానరాలేదు. కొన్ని కార్యాలయాలను ఆలయాలుగా భావిస్తూ దేవుళ్ల చిత్రపటాలను పూలతో అలంకరించి దీపారాధన చేస్తుండగా.. చాలా కార్యాలయాల్లో మాత్రం టైంపాస్ వ్యవహారాలు కనిపించాయి. అధికారులు, సిబ్బంది కుర్చీల్లో లేకున్నా ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లు తిరగడం, లైట్లు వెలగడం మరింత నిర్లక్ష్యానికి అద్దం పట్టింది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది.



ఆడిట్ కార్యాలయంలో ఉన్న ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్న ఉన్న ఒక్క ఉద్యోగి









ఉదయం 11 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న సీపీవో చాంబర్, 11.31 గంటలకు బయోమెట్రిక్ నమోదు చేస్తున్న ఉద్యోగి, డ్యూటీ సమయంలో బయటకు వచ్చి టీ తాగుతున్న సిబ్బంది, 11.30 గంటలకు పౌరసరఫరా శాఖలో అధికారులు రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి వరి ధాన్యం సేకరణను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్, తేమశాతాన్ని కొలిచే యంత్రాల పనితీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వెంటనే తేమ శాతాన్ని కొలిచి తూకం వేసి మిల్లులకు పంపించాలని అన్నారు. వివరాలను ఆన్లైన్ చేసి రైతులకు 48 గంటల్లో పేమెంట్ జరిగేలా చూడాలని తెలిపారు. ఆమె వెంట సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ సలీమ్ మియా, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనాథ్, ఏఈవో మీరా తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంట పరిశీలన

జగదేవ్‌పూర్, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం, ఇటిక్యాల, జగదేవ్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వసంతరావు మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 330 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు ఖలీల్, కిరణ్, కృష్ణమూర్తి, కల్పన తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల పరస్పర సహకార సంఘం డైరెక్టర్‌గా సంజీవరెడ్డి



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

దుబ్బాక. మే 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్‌జిల్లా న్యాయవాదుల పరస్పర సహకార సం ఘం డైరెక్టర్‌గా. దుబ్బాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మరిపెద్ది సంజీవరెడ్డిని ఎన్నుకున్నారు. శనివారం దుబ్బాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సహచర న్యాయవాదులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఆదనపు బాధ్యతలను అప్పగించడంపై హర్షం ప్రకటించారు.

బెట్టింగ్‌లతో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు



ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో పరేడ్ నిర్వహిస్తున్న సిబ్బంది

సిద్దిపేట క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆన్లైన్ గేమ్స్ బెట్టింగ్ జోలికి వెళ్లి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా పెద్దకోడూర్ గ్రామ శివారులో ఉన్న సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో జిల్లాలోని సివిల్, ఆర్మడ్ రిజర్వ్ పోలీస్, సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి, ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి బాగా ఉపయోగపడుతుందన్నారు. విధినిర్వహణ ఎంత ముఖ్యమో, ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. ఆన్లైన్ గేమ్స్ బెట్టింగ్ జోలికి వెళ్లి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణ చందర్, ధరణి కుమార్, రాజేష్, విష్ణుప్రసాద్, కార్తీక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, ఎస్ఐలు ఆర్ఎస్ఐలు పోలీస్ సిబ్బంది ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితులను బీజేపీకి దూరం చేసే కుట్ర

● **బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు రమేశ్**

చేర్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం వేచరేణిలో దళితవ్యక్తిపై దాడి ఘటనతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని, దళిత సామాజికవర్గాలను బీజేపీకి దూరం చేయాలని బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రాజకీయ దురుద్దేశంతో కుట్ర చేయడం తగదని బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ పేర్కొన్నారు. శనివారం చేర్యాలలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగిన మైకంలో హనుమాన్ విగ్రహంపై పాదం మోపి ఇతర దేవతల విగ్రహాలను ధ్వంసం చేసిన వ్యక్తిని స్థానిక ప్రజలు, హనుమాన్ భక్తులు దండించారన్నారు. బీజేపీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక రాజకీయాలు చేయడం సరికాదన్నారు.

మతిస్థిమితంలేని వ్యక్తిపై దాడి సరికాదు: పల్లా

చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో మతిస్థిమితంలేని దళిత యువకుడిపై మతోన్మాదశక్తుల దాడి సరికాదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవుడిని అవమానించిన వ్యక్తిపై విచక్షణారహితంగా దాడిచేసి నగ్నంగా ఊరేగించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల చర్యలు తీసుకోవాలని కోరారు.

'రాజీవ్ యువ వికాసం'పై బ్యాంకర్లతో సమావేశం



మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

మద్దూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకంపై మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బ్యాంకర్లతో ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎస్. రాంమోహన్ అధ్యక్షతన బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి, డీఏవో రాధిక పాల్గొన్నారు. బ్యాంకర్లతో గ్రామాలవారిగా వచ్చిన దరఖాస్తులపై చర్చించారు. ప్రభుత్వ ఆదేశానుసారం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులందరికి ఉపాధి కల్పించే దిశలో సహకరించాలని సూచించారు. మండలంలోని 1193 మంది రాజీవ్ యువవికాసానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో బీసీ కార్పొరేషన్‌కు 647, ఈబీసీకి 30, ఎస్సీ కార్పొరేషన్‌కు 391, ఎస్టీ కార్పొరేషన్‌కు 19, క్రిస్టియన్ మైనార్టీకి 13, ముస్లిం మైనార్టీకి 93 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దూళిమిట్ట ఇన్‌చార్జి ఎంపీడీవో మీసాల వీరరాజ్, టీజీబీ మేనేజర్ హరిప్రసాద్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎ. రాజు, ఎస్టీ వేల్ఫేర్ ఆఫీసర్ పి. శ్రీకాంత్, ముస్లిం మైనార్టీ ఆఫీసర్ జీషాన్ అహ్మద్, ఎస్సీ కార్పొరేషన్ ఆఫీసర్ సుమన్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ వేణుగోపాల్ ఉన్నారు.

కుల గణనకు నిధులు కేటాయించాలి

హుస్నాబాద్ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : జనాభా లెక్కలతో పాటు కుల గణన చేస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి కులగణనకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

విధి నిర్వహణలో మృతిచెందినవారికి డిపార్ట్‌మెంట్ అండ



కుటుంబ సభ్యులకు బెనిఫిట్ చెక్కులను అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు డిపార్ట్‌మెంట్ ఎప్పుడూ అండగా ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ పేర్కొన్నారు. 2024 డిసెంబర్ నెలలో అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ డీవీఆర్ రాజు కుటుంబ సభ్యులకు పోలీస్ డిపార్ట్‌మెంట్ తరఫున అందవలసిన బెనిఫిట్స్‌లో భాగంగా రూ.8 లక్షల విలువ చేసే చెక్కులను శనివారం సీపీ అందజేసి మాట్లాడారు. అనంతరం వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మరికొన్ని బెనిఫిట్స్ త్వరలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ రవీందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

● **కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ**

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 3: ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యాలయంలో అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురాకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిజాయితీగా పని చేసే అధికారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కొందరు అధికారులు ఇతర పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్నారని, ఇలాగే ఉంటే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హరికృష్ణ వెంట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, నాయకులు కలీమొద్దీన్, బొమ్మల యాదగిరి, వాహబ్, అజ్మత్, రాషాద్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 3: సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌ను కోరారు. శనివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లో కొందరు అధికారులు అవినీతికి పాల్పడుతున్నా పైస్థాయి అధికారులు వారిపై చర్య తీసుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో అవినీతికి పాల్పడినవారు తగిన మూల్యం చెల్లించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వహాబ్, రాషాద్, సంతోష, నజ్జు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

యువత హక్కుల సాధనకు ఉద్యమించాలి: ఏఐవైఎఫ్

సిద్దిపేట అర్బన్/కోహెడ, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో యువత ఉపాధి లేక నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతుందని, యువజన హక్కుల కోసం ప్రభుత్వాలను ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవనం వద్ద ఏఐవైఎఫ్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) దేశ వ్యాప్తంగా యువజన హక్కుల కోసం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్దన్, ఏఐవైఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కోహెడ మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కందుకూరి అంతయ్య ఏఐవైఎఫ్ జెండాను ఎగురవేసి మాట్లాడారు.

మంత్రి పొన్నంపై కుట్రపూరిత ఆరోపణలు సరికాదు

● **జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి**

హుస్నాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన హుస్నాబాద్‌కు ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేస్తే కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పురుమల్ల శ్రీనివాస్‌కు కడుపు నొప్పి ఎందుకని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి ప్రశ్నించారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 60 సంవత్సరాలుగా వెనుకబడిన హుస్నాబాద్ ప్రాంతాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక ఆయనపై శ్రీనివాస్ ఆరోపణలు చేయడం అవివేకమన్నారు. జగిత్యాల, మంథని, సిరిసిల్లలో ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరు చేసినప్పుడు అప్పుడు కరీంనగర్‌లో ఎందుకు చేయడం లేదని ప్రశ్నించకుండా, హుస్నాబాద్‌కు మంజూరు చేస్తే మాత్రం మంత్రిపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. కుట్రపూరితంగా ఆరోపణలు చేసిన శ్రీనుపై చర్యలు తీసుకోవాలని అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చిత్తారి రవీందర్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చిత్తారి పద్మ రవీందర్, గంపల శ్రీనివాస్, కోమటి స్వర్ణలత, రాములు, ఎండి హసన్, మైదంశెట్టి వీరన్న ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వర్గల్/కొండపాక, మే 3 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో 800 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. వర్గల్ ఎంపీడీవో కార్యాలయంలో వంటి మామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ బాగనేల్ల విజయ మోహన్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. వర్గల్ మండలంలో శనివారం 118 మంది లబ్ధిదారులకు గాను రూ. 1,18,38,717 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశామన్నారు. అదేవిధంగా కొండపాక రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికుల సమ్మె బాట

హుస్నాబాద్ టౌన్/దుబ్బాక, మే 3 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 7వ తేదీ నుంచి సమ్మె బాట పడుతున్నట్లు కరీంనగర్ రీజనల్ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఎంపీరెడ్డి తెలిపారు. శనివారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని తెలిపారు. సమావేశంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు కొంరయ్య, పుల్లయ్య తదితరులున్నారు. టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఈ నెల 7నుంచి తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలంటూ శనివారం దుబ్బాక ఆర్టీసీ బస్‌డిపోలో కార్మికులు సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. దుబ్బాక ఆర్టీసీ జేఏసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డిపో గేట్ ముందు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

తెరుచుకోని పశువైద్యశాల



పశువైద్యశాలకు తాళం ఉండటంతో మూగజీవాలతో రైతు ఎదురుచూపులు

వర్గల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలు దాటినా పశువైద్యశాలకు సిబ్బంది రాలేదు. మూగ జీవాలతో రైతులు పశువైద్యశాలకు వచ్చి సిబ్బంది కోసం పడిగాపులు కాసినా రాకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగివెళ్లిపోయారు. మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు శేటబోయిన కనకయ్య తన గొర్రెపిల్లతో చికిత్స కోసం శనివారం ఉదయం వర్గల్ పశువైద్యశాలకు వచ్చాడు. మధ్యాహ్నం 12 దాటినా రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగిపోవడం 'ఆంధ్రజ్యోతి' కంటబడింది. పశువైద్యశాల సిబ్బంది తీరుతో ఎంతో మంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సదరు రైతు వాపోయాడు. ఈ విషయమై ఇన్‌చార్జి పశు వైద్యాధికారి సర్వోత్తంను వివరణ కోరగా.. తాను మండలంలోని వేలూరు పశువైద్యశాలలో విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. అదనంగా వర్గల్ పశువైద్యశాలకు ఇన్‌చార్జి ఇవ్వడంతో ఒకే సమయంలో రెండో చోట్ల విధులు నిర్వహించలేకపోతున్నట్లు తెలిపారు.